# ఆయుర్వేదంలో అమూల్య సమాచారం

## డాక్టర్ పాలెప్ ఉద్ఘాటన

ముంబయి, జనవరి 4 (న్యూస్‌టుడే): గత యాభై సంవత్సరాల్లో విజ్ఞానం ఎంతో పెరిగి పోయిందని ప్రముఖ గైనకాలజిస్టు పాలెప్ హనుమంతరావు అన్నారు. డాక్టర్ గాయత్రీ దేవి రచించిన అమ్మాయి-అమ్మ-అమ్మమ్మ గ్రంథావిష్కరణ కార్యక్రమం మాటుంగాలోని వాసవి నిలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాలెప్ ప్రసంగిస్తూ గతంలో గర్భిణులకు ప్రసవం అనేది పునర్జన్మ ఎత్తడం లాంటిదన్నారు. ప్రసవ సమయంలో ఎన్నో సమస్యలు తలెత్తేవని తెలిపారు. బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు ఎన్నో విషయాలపై ఆయుర్వేదంలో చర్చించారన్నారు. గాయత్రీదేవి గ్రంథంలో ఆయుర్వేదం, ఇంగ్లీషు వైద్యంపై ఎన్నో విషయాలు ఉన్నాయి. గాయత్రీదేవి తెలుగు భాషా పాండిత్యం అపూర్వమన్నారు. ఇందుకు ఎంతో అధ్యయనం చేసి ప్రజలకు అర్థమయ్యే భాషలో రాయడం గొప్పతనమని తెలిపారు. ఎంతో శాస్త్రీయ విజ్ఞానంతో పుస్తక రచన చేశారని పేర్కొన్నారు. మెగాబైట్స్ జ్ఞానం చిన్న చిప్‌లో ఉంచినట్లు పుస్తక రచన సాగిందని తెలిపారు. ఇందులో ఎంతో సమాచారం ఉందన్నారు. సామవేదం షణ్ముఖ శర్మ ఈ గ్రంథాన్ని ఆవిష్కరించారు. తండ్రి ఉషశ్రీ పాండిత్యానికి వారసురాలుగా గాయత్రీదేవి నిలిచారని తెలిపారు. ఆంధ్ర మహాసభ ప్రధాన కార్యదర్శి మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఇదొక ఆధ్యాత్మిక సభ అన్నారు. హనుమంతుడిపై



పుస్తకావిష్కరణ సభలో పాల్గొన్న ప్రముఖులు

ప్రవచనాలతో సామవేదం షణ్ముఖశర్మ భక్త జనులను పులకింప చేశారన్నారు. అమ్మాయి-అమ్మ-అమ్మమ్మ గ్రంథంలో మహిళల ఆరోగ్య సమస్యలపై విపులంగా చర్చించారని తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమంలో పుస్తకావిష్కరణ జరగడం ఎంతైనా విశేషమని నానీల రచయిత సంగనేని రవీంద్ర అన్నారు. మహిళా సమస్యలపై ఉద్యమాలు జరుగుతున్నాయి. ఆరోగ్యపరంగా చిన్న చిన్న సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో ఇందులో చక్కగా వివరించారు. బాహ్య సౌందర్యం కంటే అంతః సౌందర్యం ఎంతో ముఖ్యమన్నారు. కొన్ని పుస్తకాలు తెరవగానే చదివించే గుణం కలిగి ఉంటాయని, ఆ కోవకు చెందిన రచయిత్రి డాక్టర్ గాయత్రీ దేవి అని కొనియాడారు. ఇందులో ప్రచురించిన ప్రముఖ మహిళల చిత్రాలు ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. ది బొంబాయి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు హనుమంతరావు మాట్లాడుతూ మహిళల ఆరోగ్య సమస్యలపై గ్రంథం వెలువరించడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఆరోగ్య కోశం మహిళలకు ఎంతో ఉపయోగపడుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. రచయిత్రి డాక్టర్ గాయత్రీదేవి ప్రసంగిస్తూ ఏదైనా పని జరగడానికి కారణాలు ఏమిటని చూసే అలవాటు ఉందన్నారు. తన తండ్రి ఉషశ్రీ నుంచి రాయాలన్న తపన కలిగిందని తెలిపారు. అయిదున్నరేళ్ల పాటు ఆయుర్వేదం కోర్సు చేసి ఇందులో స్థిరపడినట్లు చెప్పారు. ముందు నుంచి ఆయుర్వేదం ప్రాక్టీసు చేసి ప్రజలకు వీలైనంత సేవ చేయాలన్నది తన సంకల్పమన్నారు. ఆయుర్వేదం చదివినప్పటికీ సంపాదన దృష్టితో అందరూ అల్లోపతి వైద్యం చేస్తారని తెలిపారు. ఈనాడు, ఈ-టివిలో వచ్చిన వ్యాసాలను జోడించి పుస్తకం వెలువరించినట్లు తెలిపారు. సామవేదం సాంస్కృతిక సమన్వయ సమితి అధ్యక్షుడు సిద్ధారెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు. సమితి కార్యదర్శి గంగాధరరెడ్డి కార్యక్రమం నిర్వహించారు.